క్లుప్తంగా

రేపు ఉచిత వైద్యశిబిరం

ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులోని మెస్సీయ ఫెలోషిప్ ఆధ్వర్యాన గురువారం ఉదయం 10 గంటలకు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకులు సజ్జా ఎలియాజర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో ఉచితంగా బీపీ, షుగరు, ఈసీజీతో పాటు అవసరమైన పరీక్షలను ఉచితంగా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 94947 67633, 94947 67733లో సంప్రదించాలని సూచించారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భర్త అదృశ్యంపై భార్య కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పంజాసెంటర్ లక్ష్మీస్ట్రీట్‌కు చెందిన నారిపోగు వేణి, రవికుమార్ భార్యభర్తలు. రవికుమార్ రైల్వే ఉద్యోగి. రోడ్డు ప్రమాదం జరగడంతో అతని ఉద్యోగం వేణికి ఇచ్చారు. ఈ నెల 16న భార్యభర్తలు, కుటుంబ సమేతంగా నాగపట్నం వెళ్లారు. 20వ తేదీ తిరిగి విజయవాడ వచ్చిన తర్వాత బయటకు వెళ్లి వస్తానని చెప్పిన రవికుమార్ తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన వేణి, ఇతర కుటుంబ సభ్యులు అతతని కోసం వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో వేణి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యంపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వివాహిత అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డుకు చెందిన రాచగొర్ల అల్లూరయ్య, అల్లూరమ్మ దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు. అల్లూరయ్య గొల్లపూడి హోల్‌సేల్ కాంప్లెక్స్‌లో ముఠాకూలీ. రోజూ ఉదయం 9 గంటలకు వెళ్లి రాత్రి 10 గంటలకు ఇంటికి వస్తుంటాడు. సోమవారం రాత్రి పనికి వెళ్లి ఇంటికి వచ్చేసరికి తాళం వేసి ఉంది. భార్య పిల్లలు కనిపించలేదు. సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి ఆరాతీయగా 2.30 గంటల సమయంలో అల్లూరమ్మ పిల్లల్ని ఇంటికి తీసువెళ్లినట్లు చెప్పారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలోనే ఇంటికి తాళం వేసి ఉందని ఇంటి యజమాని చెప్పారు. దీంతో అనుమానం వచ్చిన అల్లూరయ్య ఇరుగు పొరుగు, బంధువులను ఆరా తీశాడు. భార్య పిల్లల ఆచూకీ తెలియలేదు. దీనిపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

మత్తు పదార్థాల బారిన పడకుండా చర్యలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యువత మత్తు పదార్థాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పోలీసు, విద్య, వైద్య ఆరోగ్యశాఖ, మహిళాభివృద్ధి, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ యువత ముఖ్యంగా చిన్నారులు మత్తు పదార్థాలకు బానిసవుతున్నట్లు గుర్తించామన్నారు. నగర పరిధిలోని మురికి వాడల్లో మత్తుపదార్థాల వినియోగం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై టీంలుగా ఏర్పడి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. వార్డు సచివాలయాలలోని వలంటీర్లు, మహిళా పోలీసుల సేవలను వినియోగించుకుని సమాచారం సేకరించాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు వసతి గృహాల పరిధిలో మత్తుపదార్థాల అమ్మకాలు నిర్వహించకుండా పర్యవేక్షించాలన్నారు. నగరాన్ని నాలుగు జోన్లుగా విభజించి ఆయా ప్రాంతాల పరిధిలోని మత్తుపదార్థాల అమ్మకం, వాడకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలన్నారు. సమావేశంలో ఏడీసీపీ వెంకటరత్నం, డీఈవో సీవీ రేణుక, డీఎం అండ్ హెచ్‌వో ఎం సుహాసిని, సంక్షేమ అధికారి విజయభారతి, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ ఫోన్ వినియోగంపై నియంత్రణ అవసరం

కృష్ణలంక(విజయవాడతూర్పు): పాఠశాల దశ నుంచి సామాజిక మాధ్యమాలు, వివిధ యాప్‌ల వినియోగంపై నియంత్రణ ఉండాలని ఎన్టీఆర్ జిల్లా దిశ పోలీస్ స్టేషన్ సీఐ వాసవి విద్యార్థినులకు సూచించారు. కృష్ణలంకలోని వీఎం రంగా నగరపాలక సంస్థ బాలిక పాఠశాలలో చైల్డ్‌లైన్–1098, ఫోరమ్ ఫర్ చైల్డ్ రైట్స్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వాసవి మాట్లాడుతూ పెరుగుతున్న సాంకేతికతతో పాటు రోజురోజుకీ సైబర్ నేరాలు కూడా అధికమవుతున్నాయన్నారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల నుంచి తెలియని వ్యక్తులతో పరిచయం, చాటింగ్ వంటి చర్యల ఫలితంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తోందన్నారు. అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం, ఫొటోలు షేర్ చేయవద్దని, వాటి ఫలితంగా సైబర్ నేరస్తుల బారినపడి ఒక్కోసారి కొందరు అమాయకులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ముందు జాగ్రత్తగా స్మార్ట్‌ఫోన్‌కు, అనవసర యాప్‌లకు దూరంగా ఉండాలని, వాటిపై నియంత్రణ ఉండాలని విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ అరవ రమేష్, ఎస్‌ఐ విజయ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గ్రేసమ్మ, బర్డ్స్ ఎన్జీఓ కార్యదర్శి కె.ప్రకాష్, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ నాగరాజు, వార్డు సచివాలయ మహిళా పోలీసులు, ప్రజ్వల ఎన్జీఓ ప్రతినిధులు, స్టెల్లా కాలేజీ విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు


సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ చైతన్యరెడ్డి తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. భవానీపురం 42వ డివిజన్‌లోని 125వ సచివాలయం పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం జరిగింది. ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి గడప గడపకు వెళ్లారు. మూడేళ్లల్లో ప్రభుత్వ అందజేసిన సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు తెలియజేశారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని శాఖల అధికారుల సమన్వయంతో గడప గడపకు వెళ్తున్నామన్నారు. అర్హులందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇవ్వాలనే ఉద్దేశంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతోందని వివరించారు. మూడేళ్లలో తాము చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ధైర్యంగా ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్తున్నామన్నారు. వలంటీర్ వ్యవస్థ అద్భుతంగా ఉందని ప్రజలు ప్రశంసిస్తున్నారని తెలిపారు. సచివాలయానికి కేటాయించిన రూ. 20లక్షల నిధులతో స్థానికులకు అవసరమైన పనులు చేస్తున్నామని చెప్పారు.

చంద్రబాబు అనుమతే లోకేష్‌కు లేదు

లోకేష్ పాదయాత్ర చేస్తానంటే ఆయన తండ్రి చంద్రబాబే అనుమతి ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. తన తండ్రికి దత్త పుత్రుడు ఎక్కడ దగ్గరవుతాడోనన్న భయంతో లోకేష్ పాదయాత్ర చేయనున్నాడని తెలిపారు. లోకేష్ పాదయాత్రకు అన్ని రకాల అనుమతులిచ్చినట్లు చిత్తూరు జిల్లా ఎస్పీ తెలిపారన్నారు. కానీ అనుమతులు రాలేదని టీడీపీ యాగీ చేస్తోందని ధ్వజమెత్తారు. ఆంధ్ర రాష్ట్ర యువతను మోసం చేసిన వ్యక్తి లోకేష్ అని పేర్కొన్నారు. యువగళం పేరుతో మరోసారి మోసం చేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు ఉపాధి కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో 42వ డివిజన్ కార్పొరేటర్ పి. చైతన్యరెడ్డి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ నాయకులు కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఇండో బ్రిటీష్'లో రమేష్ హాస్పిటల్ గుండె వైద్యసేవలు

అందుబాటులోకి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ


మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌బాబు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): నగరంలోని శ్రీనివాసనగర్ బ్యాంకు కాలనీలోని ఇండో బ్రిటీష్ హాస్పటల్‌లో రమేష్ హాస్పటల్ ఆధ్వర్యాన గుండె వైద్య సేవలు అందుబాటులోకి తీసుకు రానున్నట్లు రమేష్ హాస్పటల్ చీఫ్ కార్డియాలజిస్టు డాక్టర్ పోతినేని రమేష్‌బాబు చెప్పారు. ఈ నెల 26 నుంచి ప్రారంభంకానున్న గుండె వైద్య సేవలు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో అందుబాటులోకి రానున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ గుండెపోటు, స్టంట్ యాంజియోప్లాస్టీ, బైపాస్ సర్జరీ, వాల్వ్ మార్పిడి సర్జరీ, ఫేస్ మేకర్, రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్, హార్ట్ ఫెయిల్యూర్‌కు సీఆర్‌టీడీ, చిన్న పిల్లల్లో వచ్చే గుండె జబ్బులకు నిపుణులైన వైద్య బృందం సేవలు అందిస్తారని పేర్కొన్నారు. అక్కడ 50 పడకలతో 24 గంటలూ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆరోగ్యశ్రీ, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్, జర్నలిస్టు హెల్త్ స్కీమ్‌లో లబ్ధిదారులకు సేవలు అందిస్తామన్నారు. సమావేశంలో ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయుడికి పంచామృతాభిషేకాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమనవారిపేటలోని శ్రీ హనుమత్ దీక్షా పీఠంలో మంగళవారం వీరాంజనేయ స్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. అభయ వీరాంజనేయ స్వామికి పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం పంచహారతుల సేవ చేయగా ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నీళ్లకు బదులు యాసిడ్ తాగిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఘటనపై కొత్తపేట పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సాయిరాం థియేటర్ ప్రాంతానికి చెందిన తురంగి గురవమ్మ, కుమారుడు శివకృష్ణతో కలిసి నివసిస్తోంది. శివకృష్ణ సామారంగం చౌక్‌లోని మెడికల్ షాపులో పని చేస్తుంటాడు. మంగళవారం ఉదయం గురవమ్మ ఇంట్లో టేబుల్‌పై ఉన్న ప్లాస్టిక్ బాటిల్‌లో నీళ్లు ఉన్నాయని భావించి యాసిడ్ తాగేసింది. దీంతో గురవమ్మ నోటికి, పెదాలకు గాయాలు కావడంతో కుమారుడు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేస్తుండగా, మధ్యాహ్నం మృతి చెందింది. ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెంటనే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేసి చట్టబద్ధత కల్పించాలని మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పి) జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ వై.కె.విశ్వనాథ్ ఎన్నికైన సందర్భంగా మంగళవారం విజయవాడ గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాదిగల అభ్యున్నతికి, హక్కుల సాధనకు ఎంఎస్‌పీ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని కోరుతూ ఫిబ్రవరి 12ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు విజయవాడ–హైదరాబాద్ రహదారిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. వివిధ జిల్లాల ఎంఎస్‌పీ నాయకులు పాల్గొన్నారు.

నేడు నగరాల సత్రం నిర్మాణ పనులు ప్రారంభం


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జగన్, సూర్యారావు తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీశైలంలో శ్రీశైల క్షేత్ర భ్రమరాంబిక మల్లికార్జున స్వామి నగరాల కులస్తుల నిత్య అన్నదాన వసతి సత్రం నిర్మాణ పనులను ఈ నెల 25న ప్రారంభించనున్నట్లు సత్రం కమిటీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు నల్లాన సూర్యారావు, కేఎస్ జగన్ చెప్పారు. ఈ సందర్భంగా నగరంలోని ఆ కమిటీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. నగరాల కులస్తుల చిరకాల స్వప్నం, దక్షిణ కాశీగా పిలవబడే శ్రీశైల క్షేత్రంలో అన్నదాన వసతి సత్రం నిర్మాణం కోసం స్థలం కేటాయించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు రుణపడి ఉంటామన్నారు. శ్రీశైలంలో 50 సెంట్ల స్థలంలో ఈ సత్రం నిర్మాణం జరుగుతోందని, వచ్చే జూలై నాటికి పూర్తిచేయడానికి ముందుకు సాగుతున్నామన్నారు. సమావేశంలో కార్యవర్గ సభ్యులు లింగిపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ఆర్డినెన్స్ హర్షణీయం

సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వెలంపల్లి, భాగ్యలక్ష్మి అవినాష్


అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ సురేష్, గౌతంరెడ్డి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎస్సీ, ఎస్టీలకు ఆర్థిక పరిపుష్టిని పెంచి వారికి అండగా నిలబడేందుకు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను పదేళ్లు పొడిగిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడం హర్షణీయమని పలువురు ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు బూదాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీ నందిగం సురేష్, ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ గౌతంరెడ్డి, లిడ్క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, పలువురు ఎస్సీ నాయకులు పాలాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను చంద్రబాబు దారి మళ్లించి ఆయా వర్గాలకు అందకుండా చేశాడని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను మరో పదేళ్లు పొడిగిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తమ సంక్షేమానికి, అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి దళితులంతా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చైతన్యరెడ్డి, ఎస్సీ కమిషన్ సభ్యులు కాలే పుల్లారావు, ఎస్సీ నాయకులు మదిర ప్రభాకర్, కామళ్ల జోజి, లేళ్లపూడి లాజర్, యర్రజొన్నల విజయలక్ష్మి, పూనూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

• వెయ్యి మంది విద్యార్థులకు 'ఎగ్జామ్ వారియర్స్'

ప్రధాని నరేంద్రమోది రచించిన 'ఎగ్జామ్ వారియర్స్' పుస్తకాన్ని మంగళవారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఆవిష్కరించారు. వెయ్యి మంది విద్యార్థులకు పుస్తకాన్ని అందజేశారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ


విద్యార్థులకు పుస్తకాలను అందజేసి వారిని ఆశీర్వదిస్తున్న గవర్నర్


పుస్తకాలు తీసుకొని వెళ్తున్న విద్యార్థినులు

ఉద్యోగాలకు లయోల విద్యార్థుల ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్

గుణదల (విజయవాడ తూర్పు): తమ కళాశాలలో తృతీయ సంవత్సరం డిగ్రీ చదువుతున్న విద్యార్థులు పలు ఉద్యోగాలకు అర్హత సాధించారని ఆంధ్ర లయోల కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్ తెలిపారు. కళాశాల ఆవరణలో మంగళవారం క్యాంప్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ కు చెందిన హెల్త్‌కేర్ అనలిటిక్స్ కంపెనీ పలు ఉద్యోగాలను ప్రకటించిందన్నారు. డేటా అనలిస్ట్, ఎఆర్ ఎగ్జిక్యూటివ్, బిల్లర్ అసోసియేటివ్ వంటి ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరిగాయన్నారు. బీఏ, బీఎస్సీ, బీకాం తృతీయ సంవత్సరం విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన 43 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ ఫాదర్ సహాయరాజ్, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ లూర్దు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ సహాయ భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో లయన్స్ సేవలు అభినందనీయం

కలెక్టర్ ఢిల్లీరావు


వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గుణదల (విజయవాడ తూర్పు): సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండే లయన్స్ క్లబ్ నిర్వాహకులు అంధ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవడం అభినందనీయమని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెగా సిటీ ఆర్థిక సహకారంతో గుణదల విజయమేరి సంయుక్త అంధబాలల పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకాన్ని మంగళవారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంధ విద్యార్థులకు రక్షిత మంచినీటిని అందించాలనే సదుద్దేశంతో వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశారన్నారు. రూ.2.5 లక్షల వ్యయ అంచనాతో ఈ ప్లాంట్ ద్వారా మంచి నీటి సౌకర్యాన్ని అందించడం హర్షణీయమన్నారు. ప్రతి మనిషికి నీరు ప్రాణాధారమని, ప్రతి ఒక్కరూ రోజుకు 4 నుంచీ 5 లీటర్ల నీటిని తీసుకోవాలని తెలిపారు. అనంతరం లయన్స్ క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్ డాక్టర్ పుట్టగుంట సతీష్ కుమార్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు అనేక సేవా కార్యక్రమాలు జరిగాయన్నారు. ప్రకృతి విపత్తులు, కరోనా విజృంభణ వంటి విపత్కర పరిస్థితుల్లో లయన్స్ క్లబ్ ద్వారా సేవలందించామని వివరించారు. కార్యక్రమంలో 1వ డివిజన్ కార్పొరేటర్ ఉద్దంటి సునీత, పాఠశాల కరెస్పాండెంట్ సిస్టర్ అమల, ప్రిన్సిపాల్ రాజేశ్వరి, లయన్స్ క్లబ్ మెగా సిటీ ప్రతినిధులు దామెర్ల శ్రీకాంతి, లింగం శివశంకర్, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేత్రాల సమస్యలపై నిర్లక్ష్యం వద్దు


వైద్యశిబిరంలో పరీక్షలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నేత్రాలపై నిర్లక్ష్యం వద్దని అయాన్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ బషీర్ అన్నారు. కేబీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు అయాన్ హాస్పిటల్స్, ఎంజే నాయుడు హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నేత్ర, ఎముకుల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల కార్యదర్శి తూనుకుంట్ల శ్రీనివాసు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. తొలుత డాక్టర్ బషీర్ మాట్లాడుతూ ఇటీవల నేత్ర సమస్యలు అధికమయ్యాయన్నారు. సెల్‌ఫోన్ వినియోగంతో ఇతర సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఎంజే నాయుడు హాస్పిటల్స్ ఎండీ రవితేజ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయమానికి సమయాన్ని కేటాయించాలన్నారు. అలాగే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు పర్యవేక్షించారు. డాక్టర్ బాలాజీ, డాక్టర్ మణికుమార్, డాక్టర్ సందీప్, ఎంజే నాయుడు చారిటబుల్ ట్రస్ట్ గౌరవాధ్యక్షులు వావిలాల రజనీకాంత శర్మ, సేవలందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు శేషగిరిరావు, పవన్‌కుమార్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చట్టాలపై అవగాహన

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బాలికలు, యువతల రక్షణకు ప్రభుత్వం అనేక చట్టాలు అమలు చేస్తోందని, ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని ఐసీడీఎస్–1 ప్రాజెక్టు సూపర్‌వైజర్ సీహెచ్ అచ్యుతాంబ పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకుని సిండికేట్ బ్యాంక్ కాలనీలోని కోస్ట్ స్కూల్‌లో బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్య వివాహాలతో జరిగే అనర్థాలు, నష్టాలను వివరించారు. మహిళలు, బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తించినా, అసభ్యకరంగా మాట్లాడినా వెంటనే దిశ యాప్‌తో పాటు చైల్డ్‌లైన్–1098, పోలీస్ కంట్రోల్ రూమ్–100, మహిళా హెల్ప్‌లైన్ 181కు దిశ హెల్ప్ లైన్ 112కు ఫిర్యాదు చేయవచ్చునన్నారు. కిశోర్ బాలికలకు పరీక్షలు నిర్వహించి, పౌష్టికాహారం తీసుకునే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే శ్రీవల్లి, అనూష, ఏఎన్ఎం శేషారత్నం, స్కూల్ ప్రిన్సిపాల్ గిడియోన్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రేపు ఆర్యవైశ్య ఉచిత వివాహ పరిచయ వేదిక


ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న తూనుకుంట్ల శ్రీనివాసు, తేలప్రోలు వీరయ్యగుప్తా

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వాసవి విజయవాడ ఆధ్వర్యంలో ఈనెల 26న విజయవాడ కేబీఎన్ కళాశాలలో 62వ ఆర్యవైశ్య ఉచిత పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ గౌరవాధ్యక్షులు తూనుకుంట్ల శ్రీనివాసు, అధ్యక్షులు తేలప్రోలు వీరయ్యగుప్తా చెప్పారు. ఆ సంఘ కార్యాలయంలో కార్యక్రమ ఆహ్వానపత్రికను మంగళవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఆర్యవైశ్య సామాజికవర్గానికి సేవలందించే లక్ష్యంతో వాసవి విజయవాడ సంస్థను 1991లో స్థాపించామన్నారు. ఆ క్రమంలో 26వ తేదీ ఉదయం పది గంటలకు 62వ ఉచిత వివాహ పరిచయ వేదికను, మధ్యాహ్నం రెండు గంటలకు 17వ ఆర్యవైశ్య పునర్వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాన్ని డిజిటల్ రూపంలో చేస్తున్నామన్నారు. సమావేశంలో కార్యదర్శి చిట్టా అమర్ సుధీర్, కోశాధికారి లక్ష్మీ నారాయణ, కన్వీనర్ జల్లూరి నాగ శ్రీనివాసరావు, పరిచయ వేదిక కన్వీనర్ యువీ పుల్లారావు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతికి ఠాకూర్ కృషి


ఠాకూర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యానాదయ్య, శ్రీకాంత్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జననాయక్, బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ నాయీబ్రాహ్మణుల జాతి రత్నమని, ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య పేర్కొన్నారు. కర్పూరి ఠాకూర్ 99వ జయంతిని పురస్కరించుకుని గొల్లపూడి పరిధిలోని బీసీ సంక్షేమ భవన్ లోగల ఆయన కార్యాలయంలో మంగళవారం ఠాకూర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు ఎం.శ్రీనివాసులు, పట్నాల గౌరి గణపతి, దేవాలయాల జేఏసీ అధ్యక్షుడు గుంటుపల్లి రామదాసు, ఏజీఎల్ నారాయణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి


బెలూన్లు ఎగరేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రోడ్డు భద్రతపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సంబంధిత అధికారులకు సూచించారు. 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రవాణా శాఖ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ద్విచక్ర వాహన ర్యాలీని కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు కలెక్టరేట్ నుంచి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలకు ద్విచక్ర వాహనాలే ప్రధాన కారణమన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడపడం, ఇద్దరికి మించి ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేయడం, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించడం వలన ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించి కళాశాల విద్యార్థులకు చూపాలన్నారు. విద్యార్థులను చైతన్యవంతులను చేయాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీటీసీ ఎం. పురేంద్ర, రవాణా శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.